
జ్ఞాపకం



## బాపూజీ సమక్షంలో... ...

అది అపూర్వమైన రోజు.మరుపురాని అనుభూతిని పొందిన రోజు.గుండె నిండా వెన్నెల పరచిన రోజు.

దక్షిణభారత హిందీప్రచారసభ ఆవరణలో పండాల్.ఇసుక వేస్తే రాలనంత జనం.ఎత్తయిన వేదిక.వేదికముందు విద్యార్థులకోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక స్థలం.మద్రాసువంటి మహాపట్నంలోపుట్టి పెరిగిన విద్యార్థులమధ్య బిక్కు బిక్కుమంటూ నేను.అది దక్షిణభారతహిందీ ప్రచారసభ స్నాతకోత్సవం రోజు.జాతిపిత బాపూజీ సర్టిఫికెట్లు ఇవ్వబోతున్నారు.

కట్టుబాట్లమధ్య,పరదాలో,పల్లెటూర్లో పెరిగాను.వీధిబడి చదువుతోనే నా విద్యాభ్యాసం ముగిసింది.రోడ్డు దాటాలి కనుక మిడిల్‌స్కూలుకు కూడా ఆడపిల్లల్ని పంపించేవాళ్ళుకాదు.స్వాతంత్ర్యసమరయోధురాలు శ్రీమతిసూర్యదేవరరాజ్యలక్ష్మి,ఆడపిల్లలకోసం హిందీస్కూలు పెట్టించారు.అందులో చేరి పదహారేళ్ళు వచ్చేసరికి హిందీవిశారద పాసయ్యాను.కట్టుబాట్లను ఎదిరించి ప్రవీణ చదువుకోవడానికి మద్రాసు హిందీప్రచారసభకు చేరాను.ఇంగ్లీషు రాదు.అరవం రాదు.అంతవరకు మాపల్లెటూరు తప్ప,పక్కనేవున్న గుంటూరు, విజయవాడలుకూడా చూడలేదు.నాకు సంబంధించని వాతావరణంలోకి గిరాటువేయబడినట్టుగా వుండేదాన్ని.ఆవాతావరణంలో నాఅస్తిత్వాన్ని వెదుక్కుంటూవుండేదాన్ని.తెలిసీ తెలియని జ్ఞానం..చిన్నవయసు..పల్లెటూరి అమాయకత్వం....

జనంలో కలకలం.బాపూజీ వచ్చారు.చకచకా వేదిక ఎక్కారు.ఉపన్యాసాలు అయ్యాయి.విద్యార్థినిలు,విద్యార్థులూ ఒక్కొక్కరే వెళ్ళి సర్టిఫికెట్లుతెచ్చుకుంటున్నారు.బాపూజీ పాదాలకువంగి నమస్కరిస్తున్నారు.అంతజనం చూస్తుండగా,లేచి మెట్లెక్కి వేదికమీదకు వెళ్ళి ఆమహాత్ముడిముందు నిల్చుని విశారద సర్టిఫికెట్ అందుకోవాలి.గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి.అరిచేతుల్లో చెమట్లు.మనసులో ఆత్మన్యూనతాభావం అనలేను కానీ నాచుట్టూవున్న విద్యార్థినీ,విద్యార్థులు అన్నివిధాలా నాకంటేపైఅంతస్థులో వున్నారనే భావం.

నాపేరు పిల్చారు."పిల్చారా?నన్నేనా?"నాపక్కనేవున్న మోటూరిసత్యనారాయణగారి అమ్మాయి సరోజిని నన్నుచేత్తో తట్టి"నిన్నే పిలుస్తున్నారు వెళ్ళు"అన్నది.ఎలా వెళ్ళానో అన్నిమెట్లు(ఎన్నో లేవు)?ఎక్కి వేదికమీదకు వెళ్ళాను.అందరిలాగే కాళ్ళకు నమస్కరించడానికి వంగాను.ఆశ్చర్యం నేను ఊహించినట్టుగా ఆయన పాదాలు అక్కడ లేవు.కాళ్ళు మెలిక వేసుకుని పాదాలు కుర్చీకిందకు వెనక్కు పెట్టుకొని ఉన్నారు.(పదవుల కోసం పాదాభివందనాలు చేసేవారికి,కాళ్ళుచాపి పాదాలు అందించే ఈనాటి రాజకీయనాయకుల్నీ,నాయకురాళ్ళనూ చూసినప్పుడలానాకు ఆదృశ్యంగుర్తుకువస్తుంది.)

బక్కగా,పీలగా,బిక్కుబిక్కుమంటూ నిల్చున్న నన్ను చూసి బోసినవ్వు నవ్వి"సీతారామయ్యా!"అన్నారు.నేను తల అడ్డంగా తిప్పాను.పక్కనే కూర్చుని వున్న,దక్షిణభారతహిందీప్రచారసభ ప్రధానసంచాలకులు మోటూరిసత్యనారాయణగారు"కాదు,సీతారామమ్మ"అన్నారు.బాపూజీ మరోబోసి నవ్వునవ్వి"సీతారామమ్మ"అని నీలంరంగు ఖద్దరుశాలువా కప్పి విశారద సర్టిఫికెట్ అందించారు.అప్పటి ఆ అనుభూతి నాకువచ్చినభాషలో ఇమిడేది కాదు. మీరు ఊహించాల్సిందే.కిందకు రాగానే అందరూ నన్ను పట్టుకున్నారు."గాంధీజీ నీతో ఏదోమాట్లాడారు.ఏం మాట్లాడారు?"అని అడగసాగారు.నేనేగొప్పగా ఫీలయిపోతూ"నన్ను వార్ధా ఆశ్రమానికి రమ్మన్నారు"అన్నాను.చాలా మంది నిజమేనని నమ్మారు.సత్యనారాయణగారి అమ్మాయి సరోజిని మాత్రం నమ్మలేదు.తర్వాత నిజం చెప్పాననుకోండి.

కనీసం ఫోటో సేకరించి దాచుకోవాలనే ఆలోచనే రాని అజ్ఞానం...పేపర్ కటింగ్‌నైనా జాగ్రత్తచేసుకోలేని తెలియనితనం.ఇక్కడ మీకో రహస్యం తెలిసిపోయింది కదూ?నాకు పెద్దలు పెట్టినపేరు "సీతారామమ్మ"అని?!

**-వాసిరెడ్డి సీతాదేవి**


# కనిపించని గాయాలు

"నీ ఇష్టం వచ్చిన వాడ్ని కట్టుకుంటే మీ అమ్మని వదిలేస్తాను" బెదిరించాడు నాన్న.

"అదే జరిగితే చిన్నోడ్ని చంపి నేనూ చస్తాను" ముక్కు చీదింది అమ్మ.

నాన్నకేమో పిన్ని మీద ప్రేమ. అమ్మకి నాన్నంటే ఇష్టం. ఈ వంకతో తాడోపేడో తేల్చుకోడానికి సిద్ధమయ్యాడు నాన్న.

"ఎవరు రాసారు ఆ లెటర్- నిజంచెప్పు" బుజ్జగించి విషయం అడుగుదామనుకున్నాడు నాన్న.



"వాడేనా...." రెట్టించాడు.

ఎదురింటి ఇంజనీరింగ్ కుర్రాడు అదే పనిగా నన్ను చూడడం గమనించి- "వాడెందుకు అలా చూస్తాడు" అని అడిగేవాడు నాన్న.

"అవునులే అసలు మాది తప్పు, అందరి తల్లిదండ్రుల్లా కాకుండా కొంచెం స్వేచ్ఛ ఇచ్చాం చూడు అదీ..." కత్తితో పొడిచాడు నాన్న.

అవును గొప్ప స్వేచ్ఛే ఇచ్చారు. ఇంటెడు చాకిరీ- మీరిద్దరు తిట్టుకుంటూ, కొట్టుకుంటుంటే చూసి ఆనందించే స్వేచ్ఛ- మనసులో గొణుక్కున్నాను!

"అయినా అసలు ఇదంతా నీ వల్లే" నాన్న మీద గయ్యిమని అరిచింది అమ్మ.

"అన్నీ తండ్రి లక్షణాలే- ఎక్కడికి పోతాయ్ ఆ బుద్ధులు" రెట్టించింది అమ్మ.

"నా బుద్ధులు కాబట్టే ఇలా అయినా వుంది. నీలా వుంటేనా ఎప్పుడో లేచిపోయేది" అప్పుడెప్పుడో ప్రేమించి పెళ్ళి చేసుకున్న ఆ పుణ్య దంపతులు మూడోప్రపంచ యుద్ధానికి పచ్చ జెండా వూపారు.

"ఆలస్యమేం లేదు నేను చెబుతున్నాగా ఇప్పుడయినా లేచిపోమ్మను- నేను నా కొడుకు ఏ నుయ్యో, గొయ్యో చూసుకుంటాం" అమ్మ

"నువ్వెందుకు చావడం నువ్వు నీ కూతురు ఇక్కడే వుండండి, నేనే వెళ్ళిపోతాను" చిన్న అవకాశం దొరికినా రెక్కలు విప్పుకుని ఎగిరిపోవాలనే ప్లాన్‌తో అసలు విషయం బయటపెట్టాడు నాన్న.

"అవును. నువ్వు వెళ్ళిపోతావ్, ఇరవైయేళ్ళు కాపురం చేసి నన్ను నా కొడుకుని నట్టేట్లో ముంచి.." శోకాలు పెట్టింది అమ్మ.

"నువ్వెందుకు నట్టేట్లో మునుగుతావు, నన్ను ముంచుతావు గాని . . . ''

అప్పుడెప్పుడో పిన్ని వ్యవహారం తెలిసి అమ్మ అందరిముందు గొడవపెట్టిన విషయాన్ని గుర్తుచేసి ఎత్తిపొడిచాడు నాన్న.

"నువ్వు ఎవరితో పడితే వాళ్ళతో తిరిగిననాడే చచ్చిపోదామనుకున్నాను" -అమ్మ.

"... పోవాల్సింది, కాస్త ప్రశాంతతన్నా దొరికేది" రెచ్చిపోయాడు నాన్న.

"నేను పోతే ఆమెతో......" అమ్మ.

"ఏయ్! నోర్ముయ్... ఏంటి ఇష్టం వచ్చినట్లు వాగుతున్నావ్! నేనెక్కడికయినా పోతాను నువ్వెవరు..." తిట్టుకుంటూ బయటకు వెళ్ళిపోయాడు నాన్న.

"ఎక్కడికెళ్తున్నావ్ ... అక్కడికే కదా... " బెడ్ రూమ్‌లోకి వెళ్ళి తలుపేసుకుంది అమ్మ.

రెక్కలు విప్పుకుంటున్న కన్నబిడ్డ వ్యక్తిత్వం మీదే కత్తులు దూస్తున్నామన్న ఇంగితంలేక ఎవరి ఆయుధాలకు వాళ్ళు సానబెట్టుకుంటూ ఆ దంపతులు!

యుద్ధంతో సంబంధంలేకుండానే నెత్తురోడిన గాయాలతో నిండిన సైనికలా నేను! చిక్కుకున్న పంజరంలోనే సుడిగుండం లాంటి ఆలోచనలు.

**- పండరినాథ్**